## ఈసారైనా స్విమ్మింగ్‌పూల్ తెరిచేనా..?



**ఉస్మానియాయూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను ఐదేళ్లుగా మూసి ఉంచారు. గతేడాది ఆలస్యంగా ప్రారంభించి కేవలం 20 రోజులు కొనసాగించి మూసివేశారు. ప్రతిఏటా మార్చి మొదటి వారంలో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తారు. ఈ సారైన సకాలంలో ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు. అయితే ప్రారంభానికి నెల రోజుల ముందు స్విమ్మింగ్‌పూల్‌ను మరమ్మతులు చేయించిన తర్వాత నీటితో నింపేందుకు 15 రోజుల పడుతుంది. కానీ ఇంత వరకు పనులు ప్రారంభించలేదని విద్యార్థులు పేర్కొన్నారు.

## ప్రొ.శంకర్‌కు సత్కారం



ప్రొ.శంకర్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరిస్తున్న ఎన్‌బీటీ చైర్మన్ మిలింద్ మరాఠీ

**ఉస్మానియా యూనివర్సిటీ:** నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 9 వరకు ప్రపంచ పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో 'ది రోల్ ఆఫ్ అన్ డివైడెడ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ కాన్‌స్టిట్యూట్ అసెంబ్లీ'అనే అంశంపై జరిగిన చర్చలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్సిటీల అధ్యాపకులు పాల్గొన్నారు. చర్చలో అత్యంత ప్రతిభ కనబరిచిన ప్రొ.శంకర్‌ను ఎన్‌బీటీ చైర్మన్ మిలింద్ మరాఠీ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రస్తుతం ప్రొ.శంకర్ న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

## పద్మశాలీలపై చిన్నచూపు తగదు



సమావేశంలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

**బౌద్ధనగర్:** బీసీ జనాభాలో పద్మశాలి 5వ స్థానంలో ఉన్నట్లు ప్రభుత్వం తెలపడం భావ్యం కాదని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వారాసిగూడలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేయించిన ఇంటింటి సమగ్ర సర్వేలో బీసీలో మూడో స్థానంలో ఉన్న పద్మశాలి కులస్తులు ఇప్పుడు 5వ స్థానంలో ఉన్నట్లు ప్రస్తుత ప్రభుత్వం చెప్పడం సరి కాదన్నారు. తమ కులంపై చిన్నచూపు తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తక్కువ చేసి చూపెట్టడం సరైంది కాదన్నారు.

## శబ్దకాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు

చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్



**చిలకలగూడ:** నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ హెచ్చరించారు. వివాహాది శుభ కార్యాలు, పుట్టిన రోజుల పేరిట అర్ధరాత్రి వరకు సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడుతున్నట్లు తరుచు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. శబ్ద కాలుష్యంతో పలువురు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. రాత్రి సమయాల్లో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే డయల్ 100కు లేదా చిలకలగూడ ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సౌండ్ పొల్యూషన్‌ను నివారించేందుకు ప్రజలంతా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా 11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 37, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 28, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9గంటల వరకు అమలులో ఉంటాయి.

# స్విమ్మింగ్ పూల్ పనులకు మోక్షమెప్పుడో?

- లాలాపేట్‌లో ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణం
- రెండు దశాబ్దాలుగా కాలనీవాసుల ఎదురుచూపు



లాలాపేటలో శిథిలావస్థకు చేరిన స్విమ్మింగ్ పూల్ నిర్మాణం

**లాలాపేట:** తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియం ఆవరణలో జాతీయస్థాయి ప్రమాణాలతో చేపట్టిన మోడ్రన్ స్విమ్మింగ్ పూల్ పనులు ముందుకు సాగడం లేదు. రెండు దశాబ్దాలుగా ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. దీంతో కాలనీవాసులకు నిరాశ తప్పడం లేదు.

**2007లో శిలాఫలకం..**

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్) 2007 ఫిబ్రవరి 10న అప్పటి లాలాపేట కార్పొరేటర్ ఎన్. వరప్రసాద్ హయాంలో మేయర్ తీగల కృష్ణారెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పద్మారావు, ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు లాలాపేట జీహెచ్ఎంసీ మైదానంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి శిలాఫలకం వేశారు. అప్పటినుంచి నిర్మాణం మాత్రం ముందుకు సాగడం లేదు. 2007లో ఎమ్మెల్యేగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి శిలాఫలకం వేసిన పద్మారావు గౌడ్ ప్రత్యేక రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ హోదాలో 2023 అక్టోబర్ 3న మరోసారి శిలాఫలకం వేశారు. అయినా ఇప్పటికీ స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి తీసుకురాలేకపోయారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 6 కోట్లతో పనులు..**

లాలాపేటలో దాదాపు రూ. 6 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టారు. పనులు చేపట్టి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నది. ఇందులో మెయిన్ స్విమ్మింగ్ పూల్‌తో పాటు కిడ్స్ పూల్ నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ ఇప్పటికీ మెయిన్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణమే పూర్తి కాలేదు. డ్రెస్సింగ్ రూంలు, టాయిలెట్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్విమ్మింగ్‌పూల్ పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకు రావాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అసంపూర్తిగా డ్రెస్సింగ్ రూంలు

## క్రికెటర్ గొంగడి త్రిష ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



క్రికెటర్ గొంగడి త్రిషను సన్మానిస్తున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకులు

**చిలకలగూడ:** ఉమెన్స్ అండర్–19 టీ–20 వరల్డ్ కప్‌లో సత్తాచాటిన తెలుగుతేజం గొంగడి త్రిష మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు మారేడుపల్లిలోని ఆమె స్వగృహానికి వెళ్లి సన్మానించి అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గొంగడి త్రిషకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. రానున్న టోర్నమెంట్స్‌లో రాణించి తెలంగాణ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని కోరారు. నాయకులు వినోద్, ఎంఎస్ కుమార్, ప్రతాప్, అశోక్‌కుమార్, శంకర్, ప్రవీణ్, వేణు పాల్గొన్నారు.

## మెట్రో కనెక్టివిటీ బస్ షెల్టర్లను తరలించొద్దు

**లాలాపేట:** తార్నాక జంక్షన్‌కు ఇరువైపులా ఉన్న ఆర్టీసీ బస్ షెల్టర్లను తరలించొద్దని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. తార్నాక జంక్షన్ (సిగ్నల్ ఓపెన్) పునరుద్ధరణలో భాగంగా అధికారులు లాలాపేట వైపు, ఓయూ క్యాంపస్ వైపు ఉన్న బస్ షెల్టర్లను కొంతదూరం తరలించాలని యత్నించడం తగదన్నారు. ప్రస్తుతం ఉన్న షెల్టర్లు మెట్రో రైల్ స్టేషన్‌కు దగ్గర్లో ఉన్నాయని, ఇప్పుడు షెల్టర్లను తరలిస్తే మెట్రో ప్రయాణికుల కనెక్టివిటీ దెబ్బతింటుందన్నారు. దీంతో పాటు తార్నాక చౌరస్తాకు ఇరువైపులా ఉన్న హాస్పిటల్స్, ఇతర వ్యాపార సముదాయాలకు వెళ్లేవారికి సైతం దూర భారం అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి ప్రస్తుతం ఉన్న బస్ షెల్టర్లను బస్ బేలుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

## ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వండి



ఎన్‌సీసీ విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రొ.గంగాధర్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వాలని సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గంగాధర్ దాతలను కోరారు. గత నెల 26న ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు గీత, రమ, శ్రీధర్‌కు ప్రిన్సిపల్ తన వంతుగా ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రూ.15వేల చెక్కును అందజేశారు. విద్యార్థులకు దాతలు ఆర్థిక సహాయం చేస్తే ఎన్‌సీసీలో దేశానికి మరిన్ని సేవలు అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమాండర్ ప్రశాంత్ సూర్య వంశీ, తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ శరత్, కల్నల్ మంజిల్ శర్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ డా.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీఈఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్‌నాయక్



**రాంగోపాల్‌పేట్:** రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డీఈఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్ నాయక్‌ను ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లోని బసేరా హోటల్‌లో ఆదివారం జరిగిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సీహెచ్ భగవంత రావు, కోశాధికారిగా కాశీనాథ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న డీఈల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న డీఈలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉన్నత చదువులతోనే సమాజ వికాసం



విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

**సనత్‌నగర్:** ఉన్నత చదువులు చదువుకోవడం ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. ఉన్నత చదువుల కోసం జర్మనీకి వెళ్తున్న నిరుపేద విద్యార్థిని బండారు కృష్ణసాయి అలేఖ్యకు ఆయన సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. మాస్టర్స్ ఇన్ బిజినెస్ ఎనాలసిస్ అండ్ డేటాసైన్స్ కోర్సు చదువుతున్న అలేఖ్య ఉన్నతంగా చదివి దేశాభివృద్ధికి తన తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు. దేశానికి ఎంతో కొంత సేవ చేయడం ద్వారా నేర్చుకున్న విద్యకు అర్థం ఉంటుందన్నారు. నిరుపేదల చదువుకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా తనకు ల్యాప్‌ట్యాప్ అందజేసిన వెల్లాల రామ్మోహన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## కేబుల్ వైర్లను సక్రమంగా అమర్చాలి



కాసర్ మసీదు వద్దనున్న స్తంభంపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లు

**బౌద్ధనగర్:** డివిజన్‌లోని కాసర్ మసీదు సమీపంలో విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించి సక్రమంగా అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. అంతే కాకుండా స్తంభాలు కూడా శిథిలావస్థకు చేరినట్లు చెబుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్తంభాలపై అస్తవ్యస్తంగా అమర్చిన విద్యుత్, కేబుల్ వైర్లను తొలగించి సక్రమంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు స్థానికులు. ప్రాణాపాయం జరగక ముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా గ్యార్వీ వేడుకలు

**పద్మారావునగర్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ జై ప్రకాశ్‌నగర్‌లో ఆదివారం గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రేమ, దయా, కరుణ వంటి సుగుణాలతో లోక కల్యాణం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి. పవన్‌కుమార్ గౌడ్, రాజు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, వెంకట్ ముదిరాజ్, మహేందర్ గౌడ్, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## మధురానగర్ కాలనీ నూతన కమిటీ



**సికింద్రాబాద్:** సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్. బ్రహ్మచారి, ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, ఉపకార్యదర్శులు ఎల్లయ్యగౌడ్, భాను ప్రసాద్, ప్రవీణ్ రెడ్డి, మహేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కాలనీ నాయకులు మేకల సారంగపాణి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ సమయంలో కమిటీ ఎన్నిక జరిగింది.

# విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

**కాచిగూడ:** విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ సంక్షేమ గురుకుల స్కూల్స్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీల కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1600 పోస్టుల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతాలు గౌడ్, సైదులు, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**రసూల్‌పురా:** పద్మశాలీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రెండో వార్డు రసూల్‌పుర, బేగంపేట పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితులైన దొంత ప్రభాకర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆదివారం శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మశాలీలకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే అందుబాటులో ఉండి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మార్కండేయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బింగి భిక్షపతి, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**దర్గాలో ప్రార్థనలు..**

రెండో వార్డు అర్జున్‌నగర్‌లోని దర్గాను ఎమ్మెల్యే శ్రీగణేష్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. శిథిలావస్థకు చేరిన దర్గాను తన సొంత నిధులతో పునర్‌నిర్మిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

## కీసరగుట్టలో తమిళులకు వసతులు కల్పిస్తాం



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో తమిళులు

**అడ్డగుట్ట:** మహాశివరాత్రిని పురస్కరించుకుని కీసరగుట్టలో జరిగే జాతర కోసం వారం ముందుగానే మౌలిక వసతులు కల్పించేలా అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో నివసిస్తున్న పలువురు తమిళులు ఆదివారం తుకారాంగేట్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాశివరాత్రికి వారం ముందు నుంచే తమిళులు పూజలు చేసేందుకు వెళ్తారన్నారు. ప్రభుత్వం, ఆలయ కమిటీ, అధికారులు కేవలం 2 రోజులు మాత్రమే భక్తులకు ఏర్పాటు చేస్తారని చెప్పారు. అందువల్ల తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు వారం రోజుల నుంచే కల్పించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## బీజేపీ శ్రేణుల సంబురాలు

**బన్సీలాల్‌పేట్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని న్యూబోయిగూడలో బీజేపీ శ్రేణులు ఆదివారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేపట్టారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు టి. రాజశేఖరరెడ్డి, వెంకటరమణి, గుండు కృష్ణ, ఎస్. రాజు, వై. సురేశ్, హరినాథ్ నాయి, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, రమణ, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి, పరిపాలనపై నమ్మకం చెక్కుచెదరలేదనే దానికి ఈ ఫలితాలే నిదర్శమన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్సై నాగరాజు

**పంజగుట్ట:** సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ సహకారంతో తుమ్మలబస్తీలోని సమైక్య భారతి భవన్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఖైరతాబాద్ ఎస్సై నాగరాజు, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 115 మందికి సాధారణ, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీ, డెంటల్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, డాక్టర్లు శ్రీహరి, సుధాకర్, అబ్దుల్ రహమాన్, సిబ్బంది సాయిలేఖ, సౌజన్య, సునీత, భార్గవి, వైష్ణవి, సునీల్ కుమార్ సమైక్య భారతి ప్రతినిధులు అబ్దుల్ సత్తార్, మున్ని, అయబ్ ఖాన్, భరత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులివ్వాలి

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** రజకుల ఉపాధి కల్పన కోసం ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులు ఇవ్వాలని రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సొసైటీల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమనగంటి సైదులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రజకులకు ఉపాధి కల్పించేందుకు జీవో నం.343 ప్రకారం గ్రామ సొసైటీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రజకుల అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు ఆర్థిక బరోసా కల్పించే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ విషయంపై త్వరలో ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దూదిగాని చంద్రశేఖర్, చాకలి రామస్వామి, రమేష్, నర్సింహులు, నరేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ఢిల్లీ ఫలితాల స్ఫూర్తితో గ్రేటర్ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అందుకు నిదర్శనం భరత్‌గౌడ్ అని అన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు ఉద్యమించాలని సూచించారు. అధికార పార్టీ హామీల అమలుపైన పోరాటం చేయాలన్నారు. భరత్‌గౌడ్ మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, నాయకులు జి.కిరణ్, రాంరెడ్డి, గడ్డం నవీన్, వెంకటేష్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్‌ను ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో అమలు చేయాలి

బహుజన లెఫ్ట్ పార్టీ అధ్యక్షుడు దండి వెంకట్

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు నిర్వహించబోయే ఎన్నికల్లో 42శాతం బీసీ కులాల రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో ఎంబీసీ కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలన్నారు. బీసీ(ఏ) జాబితాలోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరగలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కులగణన నిర్వహించి స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు చేయకుండా జనరల్‌గా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీ(ఏ) జాబితాలో ఉన్న కులాలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధిరాములు, వడ్లసాయి కృష్ణ, కోశాధికారి మారోజు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.